# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 166 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

03-05-2026 ఆదివారం వెల : 1/- పేజీలు : 4


# జువెలరీ షాప్ డెకాయిటీకి చెక్...

# అంతర్రాష్ట్ర గ్యాంగ్ అరెస్ట్!








- కాశీబుగ్గలో సంచలనం సృష్టించిన డెకాయిటీ కేసు ఛేదన
- నాలుగు ప్రత్యేక బృందాలతో నిందితుల అరెస్ట్
- 5 మంది నిందితులు అదుపులోకి... భారీ సొత్తు రికవరీ
- పిస్టల్స్, కార్ట్రిడ్జులు, కార్లు, నగదు స్వాధీనం
- ఒడిశా గ్యాంగ్ నేర చరిత్ర బహిర్గతం
- సాంకేతిక ఆధారాలతో గ్యాంగ్ నెట్‌వర్క్ వెలికితీత
- కేసు ఛేదించిన పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

**కాశీబుగ్గలో సంచలనం సృష్టించిన జువెలరీ షాప్ డెకాయిటీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి, అంతర్రాష్ట్ర గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి భారీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాలతో పని చేసిన ప్రత్యేక బృందాలు ఈ కేసులో కీలక పాత్ర పోషించాయి.**

**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం:**

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిత్యానందనగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర జువెలరీ షాప్‌లో జరిగిన డెకాయిటీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ శనివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో వెల్లడించారు. ఈ కేసులో సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలు దోపిడీకి గురికాగా, పోలీసులు 243 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 3.41 లక్షల నగదు, 9 ఎఎ పిస్టల్, 7.65 ఎఎ పిస్టల్, కార్ట్రిడ్జులు, 12 మొబైల్ ఫోన్లు, నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రికవరీ విలువ సుమారు రూ. 49 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో 5 మంది నిందితులను అరెస్ట్ చేయగా, వీరు ఒడిశా రాష్ట్రానికి చెందిన డెకాయిటీ గ్యాంగ్ సభ్యులని పోలీసులు తెలిపారు. వీరిపై ఇప్పటికే 32 కేసులు నమోదై ఉండటం గమనార్హం. కొందరు నిందితులు గతంలో జైలు శిక్ష అనుభవించినట్లు కూడా వెల్లడించారు. కేసు వివరాల ప్రకారం, ఏప్రిల్ 7న మధ్యాహ్నం సమయంలో నిందితులు GST అధికారులుగా నటిస్తూ షాప్‌లోకి ప్రవేశించి, సీసీ కెమెరాలను పనిచేయకుండా చేసి, యజమానిని బెదిరించి బంగారం దోచుకుని పరారయ్యారు.

ముందుగా రేకీ నిర్వహించి, మార్గాలను ప్లాన్ చేసి ఈ దోపిడీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ కేసును ఛేదించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు సీసీ కెమెరాలు, వాహనాల వివరాలు, ఆధార్, మొబైల్ డేటా ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశాయి. గ్యాంగ్ మొత్తం నెట్‌వర్క్‌ను కూడా వెలికితీశారు.

ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సమన్వయం, సాంకేతిక వినియోగం పోలీసుల ప్రతిభను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు.

## రాజకీయ పార్టీలతో ఓటరు జాబితా సమీక్ష సమావేశం

- ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ 2026పై చర్చ
- ఓటర్ల మాపింగ్ పురోగతి 61.57 శాతం పూర్తి
- మిగిలిన మాపింగ్‌కు బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారం కోరింపు
- పారదర్శక ఓటరు జాబితా తయారీలో పార్టీలకు సూచనలు



**నవతరం శ్రీకాకుళం**

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవిన్యూ డివిజనల్ అధికారి కుమారి సాయి ప్రతుష్య అధ్యక్షతన శనివారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమం నేపథ్యంలో 2002 ఓటర్ల జాబితాతో 2026 ఓటర్ల జాబితా మాపింగ్ ప్రక్రియపై సమీక్ష జరిపారు.

మాపింగ్ పురోగతిని వివరిస్తూ గార మండలంలో 77.74 శాతం, శ్రీకాకుళం రూరల్‌లో 79.86 శాతం, శ్రీకాకుళం అర్బన్‌లో 47 శాతం పూర్తి కాగా, మొత్తం 61.57 శాతం మాపింగ్ పూర్తయిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా మాపింగ్ వివరాల కాపీలను రాజకీయ పార్టీల

-మిగతా 2లో

## డ్వాక్రాతో మహిళల సాధికారతకు బలం

- 180 VOAలకు 5జీ ఫోన్ల పంపిణీ
- ప్రభుత్వ పథకాలు వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గ్రామీణాభివృద్ధికి డిజిటల్ సేవలు కీలకం
- మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యమే డ్వాక్రా



2లో

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రధాన లక్ష్యం



ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహణ

4లో

## సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రామ్మోహన్ నాయుడు
- నేరేడు బ్యారేజీ పనులు త్వరలో ప్రారంభం
- రైతుల దశాబ్దాల సమస్యకు పరిష్కారం
- కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో వేగవంతమైన చర్యలు
- ఇచ్ఛాపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ



**నవతరం ఇచ్ఛాపురం**

శ్రీకాకుళం జిల్లా రైతులకు ఇచ్చిన హామీ మేరకు నేరేడు బ్యారేజీ పనులను త్వరలో ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శనివారం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించిన ఆయనను స్థానిక ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి ఉద్దానం ప్రాంత రైతులు ఘనంగా సత్కరించారు. కవిటి మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేంద్ర మంత్రిని కలిసిన రైతులు, దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

-మిగతా 2లో

ఎడిటోరియల్

# పెట్రో భయాలు

ఓవైపు కేంద్రప్రభుత్వ వర్గాలు దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని చెబుతూ అధికారిక ప్రకటనలు విడుదల చేస్తున్నాయి. మరోవైపు ఎక్కడచూసినా అవి 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయి. చమురు కంపెనీల లాభాపేక్షకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలోనూ బంకుల్లో పెట్రోలియం ఆశాజనకంగా లేదని తెలుస్తోంది. ఉత్పత్తుల కొరత, సరఫరాలో అడ్డంకుల మూలంగా సామాన్య ప్రజలు భారీగా నష్టాలతో పాటు కష్టాలనూ చవిచూడాల్సి వస్తున్నది. మోడీ సర్కారు లోపభూయిష్టమైన విదేశాంగ విధానం మూలంగా దేశం భారీ మూల్యం చెల్లించుకుంటున్నది. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించకపోగా ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చింది. మన విశ్వగురు చేసిన తప్పుకు ప్రజల ఆర్థిక, రవాణా అవసరాలను తీవ్రంగా దెబ్బతీసింది. మిత్ర దేశమైన ఇరాన్ మన అవసరాలను తీర్చేందుకు ముందుకొచ్చింది. అయినప్పటికీ కొరత పరిస్థితులను ఎదుర్కోవడంలో, చక్కదిద్దడం లోనూ కేంద్ర సర్కార్ ఘోరంగా విఫల మైంది. పెట్రోల్, డీజిల్ దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నిమ్మకు నీరెత్తి నట్టుగా వ్యవహరిస్తున్నది. ఎంతసేపూ స్వార్థ, మతోన్మాద రాజకీయ ప్రయోజనాలు మినహా దేశ ప్రజల బాగోగుల గురించి పట్టించుకునే ధ్యాసే కరువైంది.

పెట్రోల్, డీజిల్, వాహనాల గ్యాస్‌తో పాటు వంటగ్యాస్ కూడా అందుబాటులో లేదనే ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవు తున్నాయి. తెలంగాణలో ఎలాంటి కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చెబుతున్నా, పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉండటం తో పాటు దినదినగండంగా తయారైంది. కాగా వేసవి నేపథ్యంలో వ్యవసాయ కార్యకలాపాలు డీజిల్ డిమాండ్‌ను మరింత పెంచాయి. అందుకను గుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయలేకపోయాయి. 40 నుంచి 45 రోజుల వరకు సరిపడా పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా, సరఫరాలో డొల్లతనం బయటపడింది. పెరిగిన డిమాండ్‌ను తీర్చలేకపోయాయి. రేషన్ విధించాయి. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో 1967 టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించి ఫిర్యాదులు చేయాలని చెప్పాల్సి వచ్చింది. సోషల్ మీడియాలో చోటుచేసుకున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా చేస్తూ అవసరమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేసాయి. భారీ క్యూలైన్లతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బం దులకు కారణమయ్యాయి. వంటగ్యాస్ కోసం 45 రోజుల పాటు ఎదురు చూడాల్సిన దుస్థితిని కల్పించాయి. హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ కంపెనీ లు సాధారణ ప్రజల అవసరాలతో పాటు వ్యవ సాయ యంత్రాలకు డీజిల్ సరఫరా చేయలేక పోవడంతో రైతులకు తిప్పలు తప్పలేదు. రూ.2వేల నుంచి రూ.4 వేల వరకు పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేస్తుండటంతో ఎక్కువ సమయం తీసుకోవడంతోపాటు క్యూలైన్లు సైతం ఎక్కడపడితే అక్కడ భారీగా కనిపించాయి. కొరత తరుణంలో ఒకానొక సమయంలో లీటర్ పెట్రోల్‌ను రూ.125 విక్రయించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో స్టాక్ అయిపోయినట్టుగా ప్రచారం జరగడంతో వాహనదారుల తిప్పలు అన్నీఇన్నీకావు. ఇక్కడ దాదాపు అన్నీ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు పెట్టేసి మూసేశారు. దాదాపు నాలుగుకోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో సుమారు రెండు కోట్ల జనాభా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనే నివాస ముంటున్నది. అందరికీ పెట్రోలియం ఉత్పత్తులు నిత్యావసరం. పెట్రోల్ బంకుల యజమానులు, గ్యాస్‌డీలర్లు యుద్ధం పరిస్థితిని అడ్డుపెట్టుకుని కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వదంతులను కొట్టిపారేయలేం. ఎందుకంటే, బ్లాక్‌లో ఇష్టారీతినా రేట్లు పెంచి అమ్మడమే దీనికి సాక్ష్యం. ఎక్కడ చూసినా నోస్టాక్ కనిపిస్తుండటంతో సామాన్య వాహనదారుల బాధలు వర్ణణా తీతం. ద్విచక్ర వాహనాలకు రూ.200, కార్లు, ఇతర వాహనా లకు రూ.వెయ్యి చొప్పున రేషన్ విధించి అమ్ముతున్నారు. ఆర్థికపరమైన లాభాల కోసం చమురు కంపెనీలు సృష్టించిన కొరతను నివారించడంలో మోడీ సర్కార్ చర్యలు తీసుకోలేదు. తద్వారా పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర భారానికి కారణమైంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం ధరలు పెంచలేదనీ, అవి పూర్తికాగానే పెట్రో ఉత్పత్తుల ధరలకు రెక్కలు వచ్చినా ఆశ్చర్య పోనక్కర్లేదనే వ్యాఖ్యానాలు మేధావులు, రాజకీయ విశ్లేషకుల నుంచి వస్తున్నాయి. యుద్ధాన్ని ఆపలేకపోయిన మోడీ సర్కారు, భవిష్యత్‌లో ఏర్పడే చమురు సంక్షోభానికి కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనిపై ప్రధాని మౌనం దేశాన్ని మరింత సంక్షోభంలోకి పడేయటమే అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించాలి. పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉండే విధంగా చూడాలి.

# పదవ తరగతి టాపర్లకు 'ఒరియా యంగ్‌మెన్స్ లైబ్రరీ'లో ఘన సన్మానం



**నవతరం -మందస**

మందస మండలంలోని పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్థానిక 'ఒరియా యంగ్‌మెన్స్ లైబ్రరీ' ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. 2026 విద్యాసంవత్సరానికి గాను మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఐదుగురు ఒరియా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మండల స్థాయిలోనే టాపర్లుగా నిలిచారు.

ఈ సందర్భంగా లైబ్రరీ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కష్టపడి చదివి మండల స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమని కొనియాడారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి, వారిని శాలువాలతో సత్కరించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలు:
బిస్వాల జాస్మిన్ 590/600 జీటీడబ్ల్యూఏజీహెచ్ పాఠశాల, చిన్నకోస్త
సంపద గౌడో 589/600 ఎస్ఆర్ఎస్ఎంజెడ్‌పీఉన్నత పాఠశాల, మందస
ధనుష్ బెహరా 589/600 జెడ్‌పీ ఉన్నత పాఠశాల, కృష్ణాపురం
కార్తీక్ గౌడో 588/600 ఎస్ఆర్ఎస్ఎంజెడ్‌పీ ఉన్నత పాఠశాల, మందస
నందిని మల్లికో 585/600 జెడ్‌పీ

ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ఒరియా యంగ్‌మెన్స్ లైబ్రరీ సభ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఇచ్ఛాపురం తనకు ప్రత్యేకమని పేర్కొన్నారు. నేరేడు ప్రాజెక్టుకు అనుమతులు సాధించే వరకు రైతులు చేసిన పోరాటానికి సమాంతరంగా తాను కూడా కేంద్ర మంత్రులు, ట్రిబ్యునల్, ఒడిశా ముఖ్యమంత్రితో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. సాగునీటి సమస్యలను పూర్తిగా నివారించే దిశగా మరింత కృషి చేస్తామని, కూటమి ప్రభుత్వం ఈ విషయంలో కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంఘం ప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీలతో ఓటరు జాబితా సమీక్ష సమావేశం

మొదటిపేజీ తరువాయి

ప్రతినిధులకు అందజేశారు. మిగిలిన ఓటర్ల మాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు BLOలకు సహకరించాలని కోరారు. ఖచ్చితమైన, పారదర్శక ఓటరు జాబితా తయారీకి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో తహసీల్దార్ గణపతిరావు, అర్బన్ AERO జానకి, ఎన్నికల ఉప తహసీల్దార్ జి.కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఈశ్వరి, వైఎస్సార్ పార్టీ నుంచి శంకరరావు, తెలుగుదేశం పార్టీ నుంచి వెంకటేష్, శ్రీనివాసరావు, రాధాకృష్ణ రెడ్డి, జనసేన పార్టీ నుంచి భాస్కరరావు తదితరులు హాజరయ్యారు.

# డ్వాక్రాతో మహిళల సాధికారతకు బలం

**నవతరం నిమ్మాడ**

నిమ్మాడ, మే 2: మహిళలు సొంత కాళ్లపై నిలబడి ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో డ్వాక్రా సంఘాలను స్థాపించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన అన్నారు.

జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన 180 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్‌లకు 5జీ మొబైల్ ఫోన్లను మంత్రి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉూాలకు సూచించారు. డ్వాక్రా మహిళలకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా, ప్రతి ఒక్కరు తమ జాబ్ చార్ట్ ప్రకారం కట్టుబడి పని చేయాలని స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలు మహిళల ఆర్థిక ప్రగతికి కీలకంగా నిలిచాయని, పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడం గర్వకారణమని అన్నారు. 5జీ ఫోన్ల ద్వారా స్వయం సహాయక సంఘాల డేటా, పొదుపులు, రుణాల వివరాలు, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని వేగంగా నిర్వహించవచ్చని తెలిపారు. గ్రామ సంఘాలను మరింత బలోపేతం చేసి మహిళల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి. భానుమతి, కూటమి నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# దత్తత కానిస్టేబుళ్లు గ్రామాలు సందర్శన చేయాలి

- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్
- జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

**నవతరం -శ్రీకాకుళం :**

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి,ఐపీఎస్ గారు శనివారం జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, స్టేషన్‌లోని రికార్డులు, కంప్యూటర్, కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీ, ముద్దాయిల గదులు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీ వివరాలతో రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. డిస్పోజల్ అయిన ప్రాపర్టీ మరియు పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ వివరాలను వేరువేరుగా నమోదు చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీపై కోర్టు ఆదేశాల మేరకు సకాలంలో డిస్పోసెల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుని విధి నిర్వహణపై ఆరా తీసి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, దత్తత కానిస్టేబుళ్లు తమకు కేటాయించిన గ్రామాలను తప్పనిసరిగా సందర్శించాలి అని సూచించారు. పోలీస్ సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ, ముఖ్యంగా మహిళా పోలీసులతో సమన్వయం కలిగి ప్రజలతో మమేకమై, గ్రామాల్లో ఉన్న



సమస్యలు, గొడవలు, ఘర్షణలు మరియు అసాంఘిక కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించాలన్నారు. మహిళలు, చిన్నారులు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

ఇంకా, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, హెల్మెట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి అంశాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా ఎస్పీ స్టేషన్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల రికార్డులను పరిశీలించి, దర్యాప్తు పురోగతిపై సమీక్ష చేసి, పలు కేసులో సీజ్ చేసిన వాహనాలు పరిశీలించి కోర్టు ఆదేశాలు మేరకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

ఎన్ఫోర్స్మెంట్ చర్యలో భాగంగా గంజాయి, పశువులు అక్రమ రవాణాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం నూతన కమిటీ

**నవతరం - నిమ్మాడ**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు గారిని శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. జిల్లా నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా ఘనంగా మంత్రి వర్యులను సత్కరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఉద్యోగులకు రావలసిన పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలను త్వరితగతిన మంజూరు చేయాలని, దినసరి విధుల్లో ఉన్నతాధికారుల నుండి ఎదురవుతున్న పని ఒత్తిడిని తగ్గించే దిశగా తగిన చర్యలు చేపట్టాలి. రెవెన్యూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సానుకూల చొరవ చూపాలని విన్నవించారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయడం జరుగుతందని మంత్రి తెలిపారు, జిల్లా అధ్యక్షులు శ్రీ బి.వి.వి.ఎన్. రాజు, సహాధ్యక్షులు శ్రీ ఎస్. గణపతి రావు, కార్యదర్శి శ్రీ డి. సోనీకిరణ్, కోశాధికారి శ్రీ మురళీధర్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ శ్రీ బి. గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ జి.కె. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ శ్రీమతి రాధిక, ఈసీ సభ్యులు శ్రీ కె. శరత్ బాబు, శ్రీ సి.హెచ్. దామోదర్ రావు. ఏపీజేఏసీ ఛ డివిజన్ ప్రతినిధులు: ఏపీజేఏసీ అమరావతి శ్రీకాకుళం జిల్లా ఉమెన్ వింగ్ చైర్మన్ ఛ కలెక్టరేట్ అధ్యక్షులు శ్రీమతి కె. ప్రవల్లిక ప్రియ, సెక్రటరీ శ్రీమతి పి. పద్మావతి, టెక్కలి డివిజన్ అధ్యక్షులు శ్రీ బి. హేమసుందర్, శ్రీ రెయ్యి రామారావు. తదితతరులు పాల్గొన్నారు,

# మీకు తెలుసా? ప్రహ్లాదుడు వరం ఎందుకు తిరస్కరించాడు?"

-నిన్నటి తరువాయి

ఇంద్రియాణి మనః ప్రాణ ఆత్మ
ధర్మో ధృతిః హ్రీః శ్రీస్తేజః స్మృతిః
సత్యం యస్య నశ్యంతి జన్మనా
ఇంద్రియాణి మనః ప్రాణ ఆత్మ
ధర్మో ధృతిః హ్రీః శ్రీస్తేజః స్మృతిః
సత్యం యస్య నశ్యంతి జన్మనా

భాగవతం 7వ స్కంధం 10వ అధ్యాయం

ప్రహ్లాదుడు చెప్పిన భావం:

"కామకోరికలు పెరిగితే... మనిషి ఇంద్రియాలు, మనస్సు, ధర్మం, ఓర్పు, జ్ఞాపకశక్తి, సత్యం అన్నీ నశిస్తాయి."

ఇది కేవలం భక్తి మాట కాదు... ఇప్పటి సమాజానికి అద్దం పట్టే నిజం.

నేటి కుటుంబాల్లో ఇదే జరుగుతోందా?

ఎక్కువ డబ్బు కోసం ఆరోగ్యం పోతుంది
మొబైల్ కోరికతో పిల్లలు దూరమవుతున్నారు
ఆస్తుల కోసం అన్నదమ్ములు విడిపోతున్నారు
"ఇంకా కావాలి" అనే ఆశతో మనశ్శాంతి నశిస్తోంది

ప్రహ్లాదుడు వేల ఏళ్ల క్రితమే చెప్పాడు:

"కోరికలకు ముగింపు ఉండదు."

కథలో అత్యంత భావోద్వేగ క్షణం

స్వామి మళ్లీ అడిగారు:
"అయినా ఒక వరం కోరుకో!"

అప్పుడు ప్రహ్లాదుడు తలవంచి అన్నాడు:

"నా మనసులో ఏ కోరికా పుట్టకుండా ఉండే వరం ఇవ్వండి స్వామీ..."

ఆ మాట విన్న నృసింహస్వామి కూడా ముగ్ధుడయ్యారని భాగవతం చెబుతోంది.

ఈ కథలోని అసలు నిజం ఏమిటి?
ఈ కథ మనకు చెప్పేది:

దేవుడి దగ్గర భయం కాదు విశ్వాసం ఉండాలి
కోరికల బానిసైతే శాంతి పోతుంది
నిజమైన భక్తి అంటే "ఇంకా ఇవ్వు" కాదు... "నాలో ఆశ తగ్గించు" అని అడగడం
పిల్లలకు సంపద కంటే సంస్కారం గొప్పది

ముగింపు సందేశం




ప్రపంచంలో చాలా మంది దేవుడిని కోరుకునేది "నాకు ఇది ఇవ్వు" అని...

కానీ ప్రహ్లాదుడు మాత్రం ఇలా కోరుకున్నాడు:

"నాలో కోరికలే లేకుండా చేయండి."

అందుకే ప్రహ్లాదుడు భక్తుల్లో శ్రేష్ఠుడు అయ్యాడు.

శ్రీ నృసింహస్వామి జయంతి శుభాకాంక్షలు.
స్వామి అందరికీ ధైర్యం, శాంతి, మంచి బుద్ధి ప్రసాదించాలి.

భక్తి కలం : తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా , బాబు జగ్జీవన్ రామ్ నగర్ - హైదరాబాద్ - 500037

# వెల్గటూరు, జగిత్యాల జిల్లాలో.. కోటిలింగాల దేవాలయం




తెలంగాణ రాష్ట్రం, జగిత్యాల జిల్లాలో, వెల్గటూర్ మండల కేంద్రమైన వెల్గటూరు నుండి ఈశాన్య దిశలో నాలుగు కిలోమీటర్ల దూరంలో, కోటిలింగాల దేవాలయం గోదావరి నది, పెద్దవాగు సంగమస్థలంలో శ్రీ కోటేశ్వర స్వామి ఆలయం ఉంది. చారిత్రక బౌద్ధక్షేత్రంలో ఒకటి గోదావరి దక్షిణ ఒడ్డున ఉన్న ఈ దేవస్థానం గొప్ప చారిత్రాత్మక ప్రదేశం షోడష మహాజనపదాలు లలో ఒకటైన అస్సాక లేదా అశ్మక జానపదానికి రాజధానిగా ఉండేది. ఇది శాతవాహనుల క్రీ.పూ 230సం నుండి 450 సం,లు శాతవాహనులు దక్షిణ భారతదేశంలోని కోటిలింగాల ప్రాంతాన్ని రాజధాని చేసుకుని పరిపాలించారు.

## ఆలయ చరిత్ర

ఈ కోటిలింగాల క్షేత్రానికి ఘనమైన చరిత్ర ఉంది. పెద్దవాగు, గోదావరి నది సంగమంలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. ఇది గొప్ప వారసత్వం కలిగిన చారిత్రాత్మక బౌద్ధ క్షేత్రాలలో ఒకటి. ఇదే ప్రాంతం షోడష మహాజనపదాలలో ఒకటైన అస్సాక జనపదానికి రాజధానిగా ఉండేది. ఇది శివుడికి అంకితం చేయబడిన శ్రీ కోటేశ్వర సిద్ధేశ్వర స్వామి యొక్క ఆలయం. ఈ ప్రాంతం ముఖ్యంగా మత నిర్మాణానికి నాంది పలికింది. ఈ ఆలయాన్ని మూడు, నాలుగో శతాబ్దకాలంలో శతాబ్దకాలంలో శాతవాహన రాజులు నిర్మించారని చరిత్ర చెబుతోంది. కోటిలింగాల అంటే కోటి శివ లింగాలను ప్రతిష్ఠించబడిన క్షేత్రం.
ఇక్కడ శాతవాహనులు కాలంలో ఇక్కడ 110 ఎకరాల విస్తీర్ణంలో దీర్ఘ చతురస్రాకారంలో పెద్దకోట ఉండేది. దానికి ఎత్తైన గోడలతో పాటు నాలుగు మూలాల ఎత్తైన కోట బురుజులు ఉండేవి. వాటి ఈశాన్య మూలన ఉన్న కోట బురుజు శిథిలమై ఎత్తైన గడ్డగా మారిన తర్వాత కాలంలో ఈ గడ్డపైన గుడికట్టి, లింగాన్ని అనగా కోటేశ్వర స్వామిని ప్రతిష్ఠించగా దానిని కోటలింగం అని, అదే కాలక్రమేణ కోటిలింగంగా రూపాంతరం చెందిందని అంటారు. కోటిలింగాలు అంటే హోటల్లో ఉన్న శివలింగాలు అని అర్థం కానీ కోటి శివలింగాలు లేవు గోదావరి నది ఇసుకను వాటి కోటి ఇసుక రేణువుల సహాయముతో నిర్మించబడింది లింగాల గ్రామం కూడా సమీపంలో ఉంది అందువల్ల ఈ ప్రాంతాన్ని కోటిలింగాల అని పేరు వచ్చిందని అంటారు. ఈ కోటిలింగాల గ్రామానికి నాలుగు వైపులా తోటలు ఉండడం విశేషం ఈశాను ప్రాంతంలో ఉన్న హోటల్లో కోటేశ్వర స్వామి కొలువై ఉన్నారు. ఈ కోట గోడలు గోదావరి నది ఒడ్డు వెంబటి తూర్పు పడమరగా, పెద్దవాగు ఉత్తర దక్షిణములుగా దాదాపు 300 ఆనవాళ్లను బట్టి తెలియుచున్నది ఇక్కడ పురావస్తు శాఖ వారు రెండు సార్లు తవ్వకాలు జరిపారు తవ్వకాలు జరిపినప్పుడు ఈ ప్రాచీన నగరం బయల్పడింది అని అంటారు.
కోటిలింగాల దేవాలయం గోదావరి నది




తీరాన అందమైన రమనీయమైన పల్లాదకరమైన ప్రకృతి సుందరమైన దృశ్యాలను తిలకించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ యాత్రికుల కోసం ఓటింగ్ సౌకర్యం కల్పించింది. యాత్రికులు పడవల్లో ప్రయాణించి అనుభవాలను, అనుభూతులను పంచుకుంటారు.

ఈ చారిత్రాత్మక ప్రదేశాన్ని సందర్శించడానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే యాత్రికులు, భక్తులు కరీంనగర్, అదిలాబాదు ,వరంగల్, హైదరాబాదు నుండి నేరుగా వెల్గటూరు చేరుకోవాలి. కరీంనగర్,ధర్మపురి రోడ్డులో ఉంది. అచట నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో కోటిలింగాల దేవాలయం ఉంటుంది. బస్సుల్లో, ఆటోల్లో,ప్రైవేటు వాహనాల్లో కూడా ఆలయాన్ని చేరుకోవచ్చు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# కాజల్ వచ్చేస్తోంది.. మిగిలింది రకుల్ మాత్రమే!

బాలకృష్ణ సినిమా నుంచి నయనతార తప్పుకుంది, కాజల్ ను తీసుకున్నారు. లాంగ్ గ్యాప్ తర్వాత మరోసారి కాజల్ టాలీవుడ్ లో అడుగుపెడుతోంది. దాదాపు ఇది ఆమెకు రీఎంట్రీ లాంటిదే. మరి రకుల్ ప్రీత్ సంగతేంటి? కాజల్ కు వచ్చిన గ్యాప్ చిన్నదే. పెళ్లయినా, బాబుకు జన్మనిచ్చినా ఆమె సినిమాలు చేసింది. భగవంత్ కేసరి, సత్యభామ, కన్నప్ప లాంటి సినిమాలు అలా వచ్చినవే. ఇప్పుడు మరోసారి మెయిన్ లీడ్ గా మారింది.

రకుల్ పరిస్థితి మాత్రం ఇలా లేదు. ఆమెకు టాలీవుడ్ లో చాలా గ్యాప్ వచ్చేసింది. ఇండియన్-2తో మరోసారి ఇన్నింగ్స్ స్టార్ట్ చేద్దామనుకున్న ఆమె ఆశలు నెరవేరలేదు. ఆ సినిమాకు ముందు సక్సెస్ లేదు. ఆ సినిమా తర్వాత అసలు సినిమాలే లేకుండా పోయాయి. ఈ గ్యాప్ లో బాలీవుడ్ చిన్న సినిమాలు చేస్తున్న రకుల్, మంచి ప్రాజెక్టు సెట్ అయితే సౌత్ లో అడుగుపెడదామని చూస్తోంది. కానీ పెద్ద హీరోలు ఈమె వైపు చూడడం లేదు. కనీసం మిడ్-రేంజ్ హీరోల దృష్టిలో కూడా పడలేకపోవడం రకుల్ బ్యాడ్ లక్. కొత్త ఏడాదిలో సౌత్ లోకి కొత్తగా అడుగుపెడతానంటూ ఆమధ్య ప్రకటించింది. కానీ ఇప్పటివరకు ఆ ప్రకటన ఏదీ రాలేదు. నిజానికి రకుల్ పొజిషన్ లోనే పూజాహెగ్డే, కృతిశెట్టి లాంటి హీరోయిన్లు కూడా ఉన్నారు. కాకపోతే ఏదో ఒక ప్రాజెక్టు చుట్టూ వాళ్ల పేర్లు నలుగుతున్నాయి. రేపోమాపో వాళ్లు అవకాశాలు కూడా అందుకుంటారు. ఈ రేసులో రకుల్ పేరు అస్సలు వినిపించడం లేదు. అదే విచిత్రం.

# ఒక్కో చిత్రం.. ఒక్కో భాష.. ఎంతో ఆసక్తికరం

ఓ డిఫరెంట్ తమిళ డబ్బింగ్ సినిమా.. ఓ మంచి యాక్షన్ మలయాళ సినిమా.. ఓ రొమాంటిక్ ఫీల్ గుడ్ హిందీ సినిమా.. ఫక్తు కామెడీతో ఓ స్ట్రయిట్ తెలుగు సినిమా. ఇలా కాస్త జాగ్రత్తగా గమనిస్తే, ఈ వారాంతం వస్తున్న సినిమాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి.
ఈ వీకెండ్ వస్తున్న సినిమాల్లో గాయపడ్డం సింహం, జెట్లీ మాత్రమే స్ట్రయిట్ రిలీజెస్. రెండింటినీ కామెడీ చిత్రాలుగానే ప్రచారం చేస్తున్నారు. గాయపడ్డ సింహం సంగతి పక్కనపెడితే, జెట్లీ మాత్రం పూర్తిస్థాయి కామెడీ అనే విషయం అర్థమౌతూనే ఉంది.
ఈ రెండు సినిమాలతో పాటు ఈ వీకెండ్ డబ్బింగ్ సినిమాలు కూడా ఆకర్షిస్తున్నాయి. వీటిలో ముందుగా చెప్పుకోదగ్గది ఏక్ దిన్ అనే హిందీ సినిమా. సాయిపల్లవి తొలి హిందీ చిత్రం. అమీర్ ఖాన్ కొడుకు హీరోగా నటించిన సినిమా. అమీర్ ఖాన్ స్వయంగా నిర్మించిన సినిమా.
థాయ్ లో హిట్టయిన ఈ సినిమాను ఏక్ దిన్ గా హిందీలో రీమేక్ చేసి, 'ఒక రోజు' అనే టైటిల్ తో తెలుగులో డబ్ చేసి విడుదల చేస్తున్నారు. ఈ సినిమా క్లయిమాక్స్ గుండెల్ని పిండేస్తుందని చెబుతున్నాడు అమీర్. ఇక కాస్త ఇంట్రెస్టింగ్ గా కనిపిస్తున్న తమిళ డబ్బింగ్ సినిమా కర. ధనుష్



నటించిన మరో విలక్షణ చిత్రంగా దీన్ని చెబుతున్నారు. రేపు థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమాకు పెద్దగా ప్రచారం చేయనప్పటికీ, తెలుగులో కాస్త భారీగానే ఈ సినిమా రిలీజ్ అవుతోంది. మమిత బైజు హీరోయిన్, జీవీ ప్రకాశ్ సంగీతం.
ఇక మిగిలిన మరో డబ్బింగ్ సినిమా పేట్రియాట్. మమ్ముట్టి, మోహన్ లాల్, ఫహాద్ ఫాజిల్, నయనతార లాంటి హేమాహేమీలు నటించిన సినిమా ఇది. ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ నేరుగా మలయాళం వెర్షన్ లోనే ఇక్కడ రిలీజ్ అవుతుండడం విశేషం. ఈ తారాగణం చూస్తే ఎవరికైనా ఓసారి చూద్దాం అనిపిస్తుంది. అదే ఈ సినిమాకు పెద్ద ఆకర్షణ.
ఇలా ఈ వారాంతం, కేవలం తెలుగు స్ట్రయిట్ సినిమాలే కాకుండా.. డబ్బింగ్ చిత్రాలు కూడా ఆకర్షించడం విశేషం. వీటిలో ఏ సినిమా సర్ ప్రైజ్ సక్సెస్ అవుతుందో చూడాలి.

# లయశ్రీ నృత్య కళానికేతన్ ప్రదర్శనతో అలరించిన చిన్నారులు

- భద్రమహంకాళి అమ్మవారి పండుగలో సాంస్కృతిక వేడుకలు
- చిన్నారుల నృత్యాలకు ప్రేక్షకుల నుంచి ఘన స్పందన
- గురు కిల్లి పరిమళ హరిహర్ ఆధ్వర్యంలో అద్భుత ప్రదర్శన
- ఆకట్టుకున్న భిన్న నృత్య రూపాలు







**నవతరం శ్రీకాకుళం**

శ్రీ శ్రీ శ్రీ భద్రమహంకాళి అమ్మవారి గ్రామ దేవత పండుగల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 1వ తేదీ సాయంత్రం 7 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో లయశ్రీ నృత్య కళానికేతన్ చిన్నారులు అద్భుత నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.గురు కిల్లి పరిమళ హరిహర్ ఆధ్వర్యంలో చిన్నారులు శ్రద్ధగా అభ్యసించిన వివిధ నృత్య రూపాలను అందంగా ప్రదర్శించారు.

సంప్రదాయ, సాంస్కృతిక నృత్యాల సమ్మేళనంగా సాగిన ఈ ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో జే.శ్రీజ, రేణుక బాయి, శరణ్య, దివిజ, కిల్లి రాగిణి లయశ్రీ, నిషిత, జష్మిత, కావ్యప్రియ, కుసుమ, సాక్షి, సుకీర్తి, తిక్షిత, యామిని, చాందిని, నందిని, హరిణి, పూర్వి రావు, దేవన్షి, మితీష, చైత్రశ్రీ, అమృత తదితర చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ప్రేక్షకులు చిన్నారుల ప్రతిభను ప్రశంసిస్తూ ఘనంగా అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ అభినందనీయం

### మాజీ ఎంపీపీ గల్లా బాబురావు



**నవతరం శ్రీకాకుళం**

ప్రజాసేవే పరమ ధర్మం అనే స్ఫూర్తితో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమని పెదకూరపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు గల్లా బాబురావు అన్నారు.నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన చిన్నారి అమర్లపూడి రుతిక పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో శుక్రవారం ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జన చైతన్య సమితి మూడు దశాబ్దాలకు పైగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా ముందుకు పోతున్నారన్నారు.జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ పెదకూరపాడు నుండి నిత్యం సత్తెనపల్లి, అమరావతికి అత్యధిక సంఖ్యలో వాహనదారులు, ప్రయాణికులు వలస కూలీలు నిత్యం వేల సంఖ్యలో సంచరిస్తుంటారని అలాంటివారికి ఈవేసవిలో తాగునీటితోపాటు మజ్జిగ వేసవి ఉపశమనం కలిగిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మినరల్ వాటర్ దాత కొర్రపాటి వెంకటేశ్వర్లు,జన చైతన్య సమితి ప్రతినిధులు షేక్ సుభాని,గుడిపూడి బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుమారు 2000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు.

# మరణించిన వారి కుటుంబాలను పరామర్శించిన గుండ లక్ష్మీదేవి

- దీపావళి గ్రామంలో బాధిత కుటుంబాలను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే
- కుటుంబాలకు అండగా ఉంటామని హామీ



**నవతరం శ్రీకాకుళం రూరల్**

శ్రీకాకుళం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శనివారం పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు. మొదట రూరల్ మండలం పెద్దగణగళ్లవానిపేట గ్రామంలో బర్రి లక్ష్మయ్య మరణించిన విషయం తెలిసి వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అనంతరం గనగళ్ల ఎర్రమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ధైర్యం చెప్పారు.అలాగే గార మండలం గొంటి పంచాయతీ పరిధిలోని దీపావళి గ్రామంలో ఇటీవల మరణించిన లావేటి చిన్నమ్మడు, చిట్టివలస రుత్విక్ కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ బలోపేతానికి కాంగ్రెస్ ఫోకస్



- రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా పర్యటన
- గ్రామ స్వరాజ్యానికి కాంగ్రెస్ కట్టుబాటు
- కొత్త నాయకత్వానికి శిక్షణ, అవకాశాలు
- జిల్లా స్థాయిలో సమావేశం విజయవంతం

**నవతరం శ్రీకాకుళం**

రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు గంట వినయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట అప్పారావు జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిసిసి అధ్యక్షులు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ముందుగా అన్నాజీ రావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం గ్రామ పంచాయతీల బలోపేతంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో గ్రామాలకు నేరుగా నిధులు అందే విధంగా చేసిన సంస్కరణలు పంచాయతీ వ్యవస్థకు పునాది వేశాయని గుర్తు చేశారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షులు గంట వినయ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్య సాధన కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణలతో గ్రామాల అభివృద్ధికి కొత్త దిశ లభించిందన్నారు. పంచాయతీలకు నేరుగా నిధులు చేరడం వల్ల గ్రామీణాభివృద్ధి వేగం పెరిగిందని వివరించారు.గ్రామస్థాయి నుంచి కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం, పంచాయతీ నిధుల వినియోగంపై అవగాహన కల్పించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలిపారు. రాజకీయంగా ఎదగాలనుకునే యువతకు ఈ వేదిక ద్వారా అవకాశాలు కల్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి గోవింద గోపాల్, కొత్తకోట సింహాద్రి నాయుడు, చింతాడ దిలీప్, కె.వి.ఎల్, ఎస్. ఈశ్వరి, దేశెళ్ల గోవిందమల్లి బాబు, బస్వా షణ్ముఖరావు, ఇజ్జురోతు రమణ, తెంబూరు మధుసూదన్ రావు, అంబటి దాలినాయుడు, కొత్తకోట లక్ష్మి, కూరాకుల వెంకటరావు, గొల్లపల్లి దాలయ్య, జి. రామారావు, జి.పి. నాయుడు, సురియా బేగం, పలపాల రమేష్ కుమార్, బొడ్డేపల్లి శ్రీను, సోడవరం చంద్రావు, వేదాంతం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# 14 వ సంతానంగా డా.బిఆర్.అంబేద్కర్... (పార్టు..1)



అంటరాని గర్భాన
14 వ సంతానంగా
కోటిప్రభల కాంతితో ఉదయించిన
జ్ఞానసూర్యుడు డా.బిఆర్ అంబేద్కర్..!

అంటరాని మట్టిలో పుట్టినా
అక్షరాల అమృతవృక్షంగా
ఎదిగిన మహనీయుడు
మహోన్నతుడు డా.బిఆర్.అంబేద్కర్.!

బీదరికం బండరాళ్లపై బుద్ధిఅనే
ఉలితో జ్ఞానశిల్పం చెక్కిన వాడు...!

అవమానాల అగ్నికుండలోనూ
ఆత్మగౌరవాన్ని కాపాడిన అజేయజ్వాల..!

విద్యను ఆయుధంగా చేసుకుని
విదేశీ గగనంలో ఎగిరిన భారత పక్షి...!

మూసుకుపోయిన అవకాశ ద్వారాలను
మేధస్సుతో తెరిచిన మెరుపు వీరుడు..!

స్వాతంత్ర్యం కోసం గాంధీ ఉద్యమిస్తే
సమానత్వం కోసం అంబేద్కర్ గర్జించాడు.

అణగారిన వర్గాల ఆకలిని కన్నీళ్లను
ఆత్మ గౌరవ ఆణిముత్యాలుగా
మార్చిన అపర మేధావి అంబేద్కర్...!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రధాన లక్ష్యం

**నవతరం శ్రీకాకుళం**

స్థానిక శాసనసభ్యుల కార్యాలయంలో ఈరోజు ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో సమర్పించారు. ఈ ప్రజా దర్బార్‌లో 25 వినతలను స్వీకరించడం జరిగింది. ముఖ్యంగా భూ వివాదాలు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంత రహదారి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, పెన్షన్ మంజూరు, తక్కువ విద్యుత్ వోల్టేజ్, తాగునీటి సరఫరా లోపాలు తదితర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులు అందాయి. ప్రతి సమస్యను శ్రద్ధగా పరిశీలించిన శాసనసభ్యులు, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఇలాంటి ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**